హజ్ హౌస్‌కు నిధుల గ్రహణం!

- ఆగిన నిర్మాణం పనులు
- పేద ముస్లిం మైనార్టీలకు తప్పనితిప్పలు



జహీరాబాద్‌లో ఆగిన హజ్‌హౌస్ నిర్మాణం పనులు

జహీరాబాద్ టౌన్: నిరుపేద ముస్లిం మైనార్టీ కుటుంబాల్లో వివాహ, ఇతర వేడుకల నిర్వహణకు నిర్మిస్తున్న హజ్ హౌస్ పనులు నిధుల కొరతతో ఆగిపోయాయి. దీంతో నిరుపేద ముస్లిం మైనార్టీల పెళ్లిలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇబ్బందులు తప్పడంలేదు. జహీరాబాద్ పట్టణంలోని లతీఫ్ రోడ్డులో కొన్ని సంవత్సరాల కిందట షాదీఖానాను నిర్మించారు. ఇక్కడ నిఖాహాలు, వంట వంటశాల, తాగునీరు, మరుగుదొడ్లు తదితర నిర్మాణాలు చేపట్టారు. తహసీల్దార్, మైనార్టీ కమిటీల పర్యవేక్షణలో అప్పట్లో షాదీఖానాలు మెరుగైన సేవలను అందించాయి. నామమాత్రపు అద్దెతో ఇవ్వడం వల్ల నిరుపేద ముస్లిం మైనార్టీలకు ఎంతో ఉపయోగంగా ఉండేంది. ఇళ్ల పరిసరాల్లో స్థలం లేక నీటి సమస్య ఉన్న కుటుంబాలు వివాహ, ఇతర వేడుకల నిర్వహణతో కష్టాలు దూరమయ్యాయి. పర్యవేక్షణ కరువై షాదీఖానాలు నిరుపయోగంగా తయారై శిథిలావస్థకు చేరుకున్నాయి. షాదీఖానా ప్రాంగణంలో గడ్డి పొదలు పెరిగాయి. మరుగుదొడ్లు , వంటశాల, నీటి నల్లాలు దెబ్బతిని అలంకారప్రాయంగా మారాయి. వేడుకలు చేసుకోనేందుకు వీలు లేకుండా పోవడంతో పట్టణంలో అధిక సంఖ్యలో ఉన్న నిరుపేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

షాదీఖానా దెబ్బతిన్నందున అన్ని సౌకర్యాలు కల్గిన హజ్ హౌస్‌ను నిర్మించాలని ముస్లిం మైనార్టీ నాయకులు మాజీ మంత్రి హరీశ్‌రావును కోరారు. ఈ మేరకు ఆయన హజ్ హౌస్ భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో రూ. 1.50 కోట్ల నిధులు మంజూరుకు ఒప్పుకున్నారు. మొదటి విడతగా రూ.50 లక్షల నిధులు మంజూరు చేశారు. శిథిలావస్థకు చేరిన షాదీఖానాను పూర్తిగా తొలగించి అన్ని సౌకర్యాలు ఉండేలా హజ్ హౌస్ నిర్మాణం పనులు శ్రీకారం చుట్టారు. ప్రారంభంలో పనులు చురుగ్గా కొనసాగాయి. పిల్లర్ దశకు చేరుకున్న తరువాత ప్రభుత్వం మారింది. నిధులు మంజూరు ఆగిపోవడంతో కాంట్రాక్టర్ హజ్‌హౌస్ పనులను నిలిపేశారు. నిరుపేద ముస్లింలు ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌ను ఆశ్రయించక తప్పడంలేదు. నామమాత్రపు రుసుముతో వినియోగించుకునే వీలున్నా షాదీఖాన అందుబాటులో లేకపోవడంతో కొత్తగా కడుతున్న హజ్ హౌస్ అసంపూర్తిగా ఉండడంతో పేదల వివాహ వేడుకల ఖర్చులు పెను భారంగా మారుతోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అర్థాంతరంగా ఆగిన షాదీఖాన పనులకు నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని మైనార్టీ నాయకులు కోరుతున్నారు.

భూకంపాలను తట్టుకునే పరిజ్ఞానం

ఎన్ఐటీ పూర్వ డీన్ ప్రొఫెసర్ వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఐటీ పూర్వ డీన్ ప్రొఫెసర్ వెంకట రమణ

పటాన్‌చెరు: భూకంపాలను తట్టుకునేలా భవనాలు నిర్మించేందుకు అత్యాధునిక పరిజ్ఞానం అందుబాటులో ఉందని ఎన్ఐటీ సూరత్కల్ మాజీ డీన్ (విద్య) ప్రొఫెసర్ కట్టా వెంకటరమణ పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ×ఇంజనీరింగ్ భూకంప శాస్త్రం గత భూకంపాల నుంచి నేర్చుకోవడం॰ అనే అంశంపై ఆయన ప్రసంగించారు. భూకంప నిరోధక భవన నిర్మాణ డిజైన్ కోసం బేస్ ఐసోలేషన్ టెక్నిక్, బ్రేసింగ్ సిస్టం వంటి పలు వినూత్న పద్ధతులు ప్రస్తుతం అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఎయిర్ బ్యాగ్ విధానంలో భూకంపం వచ్చినప్పుడు భవనం కొద్దిగా పైకి లేచి, ప్రకంపనలు తగ్గిపోగానే యథాస్థితికి వచ్చే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కూడా అందుబాటులో ఉందన్నారు. భూకంపాలు టెక్టోనిక్ ప్లేట్లు ఢీకొనడం వల్ల సంభవిస్తాయని, సీస్మోగ్రాఫ్ ద్వారా దాని తీవ్రతను కొలుస్తారని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

మాజీ డీఎస్పీ గంగాధర్ మదనం



మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ గంగాధర్

సంగారెడ్డి: సంచార జీవితం, పేపర్ బాయ్‌గా ప్రస్థానాన్ని ప్రారంభించి డీఎస్పీ సాయికి ఎదిగి ప్రభుత్వంలో 200లకు పైగా అవార్డు పొందిన తనకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు ఇచ్చి గెలిపించాలని గంగాధర్ మదనం జిల్లా పట్టభద్రులును కోరారు. ఆయన మాట్లాడుతూ.. డీఎస్పీ స్థాయిని, 12 ఏళ్ల భవిష్యత్‌ను వదులుకొని రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. సంచార జాతికి చెందిన వాడిగా, 26 ఏళ్ల సుదీర్ఘ పోలీసుల వృత్తిలో ఉన్న అనుభవంతో పేదవాడి గొంతుక వినిపించడానికి చట్టసభలే సరైన వేదిక అని భావించి రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటు ఇచ్చి గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఓటరుగా నమోదు చేసుకోవడానికి నోటిఫికేషన్ వరకు సమయం ఉన్నందున జిల్లాలోని పట్టభద్రులందరూ ఓటర్‌గా నమోదు కావాలని కోరారు.

ఏడాదిలోనే సంక్షేమ పథకాలు అమలు

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



లబ్ధిదారుకు పథకాల ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: పదేళ్ల బీఆర్ఎస్ కాలంలో ఒక్క రేషన్ కార్డు, ఒక్క డబుల్‌బెడ్ రూం ఇల్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పథకాలు అమలు చేసి చూపిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నాగల్‌గిద్ద మండలం ఇరక్‌పల్లిలో ప్రజాపాలనలో భాగంగా నాలుగు సంక్షేమ పథకాల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలన్నీ అందుతాయని, బీఆర్ఎస్ నాయకుల మోసపూరిత మాటలు నమ్మి మోసపొద్దని చెప్పా రు. సంపన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా బీఆర్ఎస్ మార్చిందని మండిపడ్డారు. నేడు అప్పులు, వడ్డీలు చెల్లిస్తూనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే రేషన్ కార్డులు అందించగా ఇప్పుడు మళ్లీ అందిస్తున్నామన్నారు. ఇరక్‌పల్లిలోని నీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే, నిజాంపేట మండలం రాంరెడ్డిపేటకు చెందిన మాజీ సర్పంచ్ భూమయ్యకు అత్యవసర వైద్యఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీని బాధితుడికి అందజేశారు.

'బేటి బచావో.. బేటి పడావో'పై అవగాహన



విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: మండలంలోని జూకల్ శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం బేటి బచావో.. బేటి పడావో దశాబ్ధి ఉత్సవాల్లో భాగంగా లింగ వివక్షత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న ఖేడ్ ఎస్సై శ్రీశైలం బాలల హక్కులు, చట్టాలు, పోక్సో, నిర్భయ చట్టాలు, సైబర్‌నేరాలు, మద్యపానం, ధూమపానం వల్ల కలిగే అనర్థాలు, 100, 101, 108, 1098 హెల్ప్ లైన్ నంబర్ల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ లింగారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జమున, మహిళా సాధికారిత కేంద్రం ఫైనాన్షియల్ స్పెష లిస్టు నర్సింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శానిటేషన్‌పై దృష్టి సారించండి

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న చంద్రశేఖర్

సదాశివపేట(సంగారెడ్డి): అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సోమవారం రాత్రి సదాశివపేట మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ బాలుర గురుకుల హాస్టల్‌లో రాత్రి నిద్ర చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ వంటగది, డైనింగ్ హాల్ను, స్టోర్ రూంను పరిశీలించారు. పాఠశాలలో పరిశుభ్రత ఇతర శానిటేషన్ పనులపై దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అదనపు కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జగదీష్, వార్డెన్ కవిత ఉన్నారు.

జేఎన్‌టీయూ ఒప్పంద అధ్యాపకుల నిరసన



నిరసన తెలుపుతున్న ఒప్పంద అధ్యాపకులు

సంగారెడ్డి: ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించిన తర్వాతే నోటిఫికేషన్‌కి వెళ్లాలని సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఒప్పంద అధ్యాపక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కళాశాల ఆవరణలో నిరసన తెలిపారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో రిటర్మెంట్ వయస్సు 65కి పెంచుతామని, త్వరలో నోటిఫికేషన్ వెళ్తామన్నా సీఎం వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో 1445 ఒప్పంద అధ్యాపకులపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధాకరమన్నారు. క్రమబద్ధీకరణ ఆలస్యం అయితే.. బేసిక్, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, మూడు శాతం ఇంక్రిమెంట్‌తో ఉద్యోగ భద్రత కల్పిస్తే కేంద్ర ప్రభుత్వ పరిశోధన ప్రాజెక్టులు పొంది యూనివర్సిటీ పరిశోధన రంగంలో అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అందరిని క్రమబద్ధీకరించాలని, దాదాపు ఇరవై ఏళ్ల క్రితం ప్రారంభించిన సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్స్‌లుగా మార్చి పోస్టులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సాయిచంద్ర, అధ్యాపక బృందం ఉన్నారు.

యునైటెడ్ పెన్షన్ స్కీంను వ్యతిరేకిస్తూ వినతి



వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ బాధ్యులు

నారాయణఖేడ్: కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేయనున్న యునైటెడ్ పెన్షన్ స్కీంను వ్యతిరేకిస్తూ సోమవారం ఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తికి టీఎస్ పీఆర్టీయూ ఖేడ్ అర్బన్, రూరల్ శాఖల బాధ్యులు వినతిపత్రం అందించారు. యునైటెడ్ పెన్షన్ స్కీంను అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని కేంద్రం వత్తిడి తీసుకువచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దేవిసింగ్, స్థానిక బాధ్యులు శివరాం, భీంరావు, హనుమయ్య, మల్లయ్య, లక్ష్మణ్, రాఘవేందర్, గురునాథ్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారి



పటాన్‌చెరు : అమీన్‌పూర్ మున్సిపల్ పాలకవర్గం ఐదేళ్లు పూర్తి కావడంతో సోమవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. అమీన్‌పూర్ మున్సిపాలిటీకి సీడీఎంఏ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఫాల్గుణ కుమార్ ప్రత్యేక అధికారిగా నియమించారు. ఆయన సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కమిషనర్ జ్యోతిరెడ్డి అమీన్‌పూర్ మున్సిపాలిటీ రికార్డుల వివరాలు తెలియజేశారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ లో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథ నం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 20 మందిని అదుపులోకి తీసుకొని జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కేసీఆర్‌ను కలిసేందుకు పాదయాత్ర



పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఝరాసంగం(జహీరాబాద్): మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు గజ్వేల్‌లోని ఎర్రవల్లి నివాసానికి మండలంలోని మెదపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పరమేశ్వర్ నాయకులతో కలిసి పాదయాత్రగా తరలివెళ్లారు. ఈ మేరకు దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేసి పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల జారీలో జాప్యం



ఆపరేటర్‌తో వాగ్వాదానికి దిగిన తల్లిదండ్రులు

నారాయణఖేడ్: విద్యార్థుల కుల, ఆదాయ, స్థానిక ధ్రువపత్రాల జారీలో ఖేడ్ రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. మీసేవలో సర్టిఫికెట్లు ఆన్‌లైన్ చేసిన తర్వాత తహశీల్ కార్యాలయంలో సంప్రదిస్తే దురుసుగా సమాధానం ఇస్తూ తిప్పించుకుంటున్నారని వాపోయారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలల్లో స్కాలర్‌షిప్‌లు ఇతరత్రా అవసరాలకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లకుండా కార్యాలయం చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇబ్బందులకు గురిచేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్ల విషయంలో ఇబ్బందులకు గురిచేస్తే రెవెన్యూ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. త్వరలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఉపాధి హామీ పనులపై 'ప్రజావేదిక'

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. అదనపు డీఆర్డీఓ బాలరాజు సమక్షంలో మండలంలోని అన్ని గ్రామాల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేపట్టిన రూ.9.56కోట్ల ఉపాధి హామీ పనులకు సంబంధించిన నివేదికలను గ్రామాల వారీగా డీఆర్పీలు చదివి వినిపించారు. గ్రామాల్లో కూలీలు చేపట్టిన పనులు హాజరు, అవెన్యూ ప్లాంటేషన్‌ల్లో నాటిన మొక్కలు, ప్రస్తుతం ఉన్న మొక్కల వివరాలను వెల్లడించారు. కొలతల్లో తేడాలు, మాస్టర్లలో కూలీల సంతకాలు లేకపోవడం, పని ప్రదేశం తేడాలు, గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులు పనులు చేయడం తదితర అంశాలను గుర్తించారు. ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు డీఆర్డీఓ బాలరాజు హెచ్చరించారు. కార్యక్రమంలో డీవీఓ నాగేశ్వర్ రావు, ప్లాంటేషన్ మేనేజర్ మణి కుమార్, ఎంపీడీఓ లక్ష్మి, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్ధన్న, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల భూములను కాపాడండి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: స్థిరాస్తివ్యాపారులు, ఫాంల్యాండ్స్ యజమానుల నుంచి దళితుల భూములను కాపాడాలని సోమవారం ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తుకారాంనాయక్, డివిజన్ నాయకులు ఆర్డీఓ అశోకచక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని అనేక చోట్ల స్థిరాస్తి వ్యాపారులు, ఫాంలాండ్స్ యజమానులు దళితుల భూములను స్వాధీనం చేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారని అన్నారు. భూములు ఇవ్వనివారిపై దాడులకు దిగుతూ భయాందోళనలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. పలుచోట్ల వెంచర్లు, ఫాంల్యాండ్లకు దళితుల భూముల్లోంచి రోడ్లు వేసి పనికి రాకుండా చేశారని ఆరోపించారు. దళితుల భూములను ఆక్రమించినవారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ నూతన కార్యవర్గానికి సన్మానం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రంలోని దేవాలయ కమిటీ అధ్యక్షుడిగా మంద్దుల బాల్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడిగా ఇటీవల నూతనంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి సోమవారం బాల్‌రెడ్డిని సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవాలయాలు, రైతు సంఘాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు శంకర్, హనుమంత్‌రెడ్డి, మొగులయ్య, ఆంజనేయులు, మోహన్‌రెడ్డి మహిపాల్ రెడ్డి, సుర్యనారాయణ, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

◆ మైక్‌సెట్ బహూకరణ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని రేజింతల్ ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన ఉమనర్సింహారావు దంపతులు మైక్‌సెట్‌ను బహూకరించారు. ఈ నెల 26న పాఠశాలలలో జరిగిన గణతంత్ర వేడులకు నర్సింహరావు దంపతులు హాజరయ్యారు. పాఠశాలలో మైక్‌సెట్ లేదని గుర్తించి కొనుగోలు చేశారు. సోమవారం మైక్‌సెట్‌ను ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ భూ వివాదం.. ఇరు వర్గాలపై కేసు

పటాన్‌చెరు టౌన్: ఓ భూ వివాదంలో.. ఇరు వర్గాలపై కేసు నమోదయింది. పటాన్‌చెరు సీఐ వినాయక్‌రెడ్డి కథనం ప్రకారం.. పటాన్‌చెరు శివారులో ఉన్న ఓ స్థలంలోకి దాదాపు వందమంది గేటు తోసుకొని వచ్చి గడ్డి వామును తగులబెట్టారు. తమ భూమిలోకి వచ్చి గడ్డివాము కాల్చేసి, కుర్చీలు ధ్వంసం చేశారని అశోక్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. తనభూమిలో గడ్డివాము, ఆవులను ఉంచారని వీరేశం అనే వ్యక్తి ఫిర్యాదు ఇవ్వడంతో మరో కేసు నమోదు చేశారు. అయితే, గేటు తోసుకుంటూ వచ్చి గడ్డి వాము తగుల బెట్టిన వ్యక్తులు ఎమ్మెల్యే వర్గీయులని అశోక్ ఆరోపించటంతో పోలీసులు విచారించగా.. అది అసత్య ఆరోపణ అని తేలడంతో దానిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

◆ వీరశైవ లింగాయత్ యువజన కార్యదర్శిగా నరేష్

జహీరాబాద్ టౌన్: వీరశైవ లింగాయత్ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా జహీరాబాద్‌కు చెందిన నరేష్ పాటిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నరేష్ పాటిల్ మాట్లాడుతూ.. వీరశైవ లింగాయత్‌ల సంక్షేమ కోసం కృషి చేస్తానన్నారు.

◆ బాధిత కుటుంబానికి పరామర్శ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని మెరియంపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు బస్వరాజ్ పాటిల్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీఎస్ఎస్‌సీసీడీసీ మాజీ చైర్మన్ వై.నరోత్తం సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

◆ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

సంగారెడ్డి రూరల్ : పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సోమవారం పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్‌తో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పద్మశాలీల సమస్యలు తనకు తెలుసని వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. జిల్లా పద్మశాలి సంఘ భవన నిర్మాణానికి పూర్తి సహకారం ఉంటుందన్నారు. దేశంలో ప్రత్యేకమైన, గొప్పవత్తి నైపుణ్యాన్ని కలిగిన ఘనత పద్మశాలీలకే ఉందని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంఘం యువజన అధ్యక్షుడు రాజు, రాష్ట్ర పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సీత వైద్యం కిషోర్, పద్మశాలి సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లేశం, మహిళలు పాల్గొన్నారు.

మందకృష్ణకు పద్మశ్రీ హర్షణీయం

కంగ్టి(నారాయణఖేడ్): మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం హర్షణీయమని సంగారెడ్డి జిల్లా మాదిగ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా అలుపెరగని పోరాటంతో ఉద్యమ కృషికి గుర్తింపు రావడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఫోరం కన్వీనర్ బాబుమాదిగ, కంగ్టి ప్రధాన కార్యదర్శి వైజ్యనాథ్ మాదిగ, పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

కల్హేర్(నారాయణఖేడ్): ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని పీఆర్టీ యూ మండల అధ్యక్షుడు రాంమోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కల్హేర్‌లో తహసీల్దార్ శివ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, వంశీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడలతో యువతకు మంచి భవిష్యత్



విజేత టీంకు కప్‌ను అందజేస్తున్న రామ్‌రెడ్డి

సదాశివపేట (సంగారెడ్డి): క్రీడల్లో రాణిస్తే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి పేర్కొన్నారు. గుండు శ్రీనివాస్ జ్ఞాపకార్థం పట్టణంలోని శ్రీకృష్ణనగర్ కాలనీలో మాజీ కౌన్సిలర్ గుండు రవి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌కు ఆరు టీంలు పాల్గొన్నారు. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో యూఎస్ టీం, ఉద్దేర సంఘం టీంలు తలపడగా ఉద్దేర టీం విజయం సాధించింది. విజేత ఉద్దేర సంఘం టీంకు సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ కప్‌ను అందజేశారు.

23న మల్లన్న జాతర



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఫిబ్రవరి 23న మల్లన్న జాతరను నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ బి.పుష్ప తెలిపారు. సోమవారం నూతనంగా ఆలయ కమిటీ, గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఏటా మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అందరితో చర్చించి జాతరను వైభవంగా నిర్వహించేలా నిర్ణయించినట్లు చెప్పారు.

ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారికి వీడ్కోలు



శ్రీనాథ్‌శర్మ దంపతులను సత్కరించిన ఏజెంట్లు

జహీరాబాద్: ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనాథ్‌శర్మకు ఏజెంట్లు, సిబ్బంది సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏజెంట్లు మాట్లాడుతూ.. శ్రీనాథ్‌శర్మ విధి నిర్వహణలో తమకు అందుబాటులో ఉండి సేవలిందించారని కొనియాడారు. ప్రీమియం విషయంలో తలెత్తే సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించేవారని అన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు విఠల్‌గౌడ్, కార్యదర్శి ప్రవీణ్, డివిజన్ నాయకులు కిష్టన్న, మాధవరావు, వెంకటేష్, రాజ్‌కుమార్, అంజయ్య, మోహన్‌రెడ్డి, చంద్రారెడ్డి, నసీరుద్దీన్, విఠల్, లక్ష్మి, అశోక్‌రెడ్డి, లక్ష్మయ్య, ప్రభు పటేల్, గుండప్ప పాల్గొన్నారు.

మాజీ మంత్రి పద్మారావు గౌడ్‌కు ఎమ్మెల్యే పరామర్శ



పద్మారావుతో మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఇటీవల అనారోగ్యానికి గురైన మాజీమంత్రి, తెలంగాణ మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను సోమవారం సికింద్రాబాద్‌లోని ఆయన నివాసంలో కలసి పరామర్శించారు. భగవంతుడి కృపతో...అతి త్వరగా కోలుకుని ప్రజాసేవలో పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు.

కిషన్‌సింగ్‌కు సన్మానం



కిషన్‌సింగ్‌ను సన్మానిస్తున్న చందర్‌నాయక్

కల్హేర్(నారాయణఖేడ్): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్‌సింగ్‌ను నిజాంపేట్ మండలం చందర్‌నాయక్ తండావాసులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి పొందడంతో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో తండానాయక్ తుకరాం, గోవింద్‌నాయక్, తండా ప్రముఖులు రాములు, వసంత్, రవీందర్, రూప్‌సింగ్, రాజ్యా, మారుతి పాల్గొన్నారు.